

మల్లాపురంలో కూల్చిన యువజన సంఘం భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

# అర్ధరాత్రి యువజన భవనం కూల్చివేత

**కాంగ్రెస్ ఎమ్మెల్యే కక్షతోనే కూల్చారని గ్రామస్థుల మండిపాటు**

యాదగిరిగుట్ట, జనవరి 22: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రజా అవసరాల కోసం నిర్మించిన యువజన సంఘం భవనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో ఆదివారం అర్ధరాత్రి అధికారులు, 100 మంది పోలీసులతో యువజన సంఘం భవనాన్ని జేసీబీలతో నేలమట్టం చేశారు. గ్రామ సర్పంచ్ కర్రె వెంకటయ్య రూ.27 లక్షల సొంత నిధులతో నిర్మించిన ఈ భవనాన్ని కూల్చివేయడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మించారన్న ఆరోపణతో గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదేశాలతో అధికారులు ఈ ఘటనకు ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సోమవారం మల్లాపురానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో ఆలేరు నియోజకవర్గ ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే అలజడి సృష్టించి గ్రామాల్లో భయానక వాతావరణం సృష్టిస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలోనే నిర్మించారని నిర్ధారణ జరిగితే ఆ భవనాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగిస్తే బాగుండేదని చెప్పారు. ఎమ్మెల్యే అయిలయ్య ఒత్తిడితో అధికారులు విచక్షణ కోల్పోయి ప్రవర్తించారని ఆరోపించారు.

# ఏసీబీకి చిక్కిన ఆబ్కారీ సీఐ

**65 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన బాలాజీ**



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎక్సైజ్ సీఐ బాలాజీ

జడ్చర్లటౌన్, జనవరి 22: కల్లు గీతా కార్మికులకు టీఎఫ్‌టీ లైసెన్స్ జారీ విషయంలో లంచం తీసుకుంటూ ఆబ్కారీ సీఐ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఆబ్కారీ కార్యాలయంలో సోమవారం చోటుచేసుకున్నది. మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ బీ శ్రీకృష్ణగౌడ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. భూత్పూర్ మండలం పోతులమడుగుకు చెందిన రేకుల తిరుపతయ్యగౌడ్, ఆయన కుమారులు శ్రీకాంత్‌గౌడ్, శ్రీహరిగౌడ్ కల్లు గీతా కార్మికుల టీఎఫ్‌టీ లైసెన్స్ కోసం ఈ నెల 17న మహబూబ్‌నగర్ ఏఈఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకుగానూ ఈ నెల 18న జడ్చర్ల మండలం గొల్లపల్లి గ్రామ శివారులో ఎక్సైజ్ అధికారులు టీఎఫ్‌టీ లైసెన్స్ కోసం పరీక్షలు నిర్వహించారు. లైసెన్స్ జారీ విషయంలో జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలాజీ రూ.90 వేలు లంచం డిమాండ్ చేశాడు. వాటిలో అడ్వాన్స్ కింద రూ.25 వేలను ఈ నెల 19న ఇచ్చారు. మిగతా డబ్బుల కోసం సీఐ బాలాజీ ఒత్తిడి తీసుకురాగా.. బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు.. తిరుపతయ్యగౌడ్ సోమవారం సాయంత్రం జడ్చర్ల ఆబ్కారీ కార్యాలయానికి వెళ్లి సీఐ బాలాజీని కలిసి రూ.65 వేలు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్, సీఐలు లింగస్వామి, అబ్దుల్‌ఖాదర్‌జిలానీ, సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.65 వేలు స్వాధీనం చేసుకున్నామని, సీఐని ఏసీబీ నాంపల్లి కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ బీ శ్రీకృష్ణగౌడ్ తెలిపారు. సీఐ ఆస్తులపై కూడా విచారణ చేపడతామని వివరించారు.

# కందులు క్వింటా 10 వేలు

- తొలిసారి కందికి రికార్డు ధర
- 10 వేల మార్క్ దాటిన వైనం
- నిల్వలపై కేంద్ర సర్కారు దృష్టి
- మార్క్‌ఫెడ్‌తో కలిసి మార్కెట్ ధరకు కొనేందుకు నాఫెడ్ చర్యలు



హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): కందులకు బహిరంగ మార్కెట్‌లో రికార్డు ధర పలుకుతున్నది. ఎప్పుడూ లేనివిధంగా క్వింటా కందులు రూ.10 వేలకుపైగా ధర పలుకుతుండటం విశేషం. నారాయణపేట వ్యవసాయ మార్కెట్లో సోమవారం క్వింటాల్‌కు రూ.10,120, తాండూరు రూ.10,012 ధర పలికింది. దేశవ్యాప్తంగా ఉత్పత్తి తగ్గిపోవడంతో రాబోయే రోజుల్లో కందుల కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నది. ముందు జాగ్రత్తగా వ్యాపారులు అధిక ధర వెచ్చించి రైతుల నుంచి కందుల కొనుగోలుకు పోటీ పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా నిల్వలు పెంచేందుకు నాఫెడ్ సంస్థతో దేశవ్యాప్తంగా 10 లక్షల టన్నుల కందులు కొనాలని నిర్ణయించింది. తెలంగాణలో మార్క్‌ఫెడ్ ద్వారా 50 వేల టన్నుల సేకరణకు అనుమతి ఇచ్చింది. ఎప్పుడైనా నాఫెడ్, మార్క్‌ఫెడ్ మద్దతు ధరకు మాత్రమే పంట ఉత్పత్తుల్ని కొనుగోలు చేస్తాయి. కానీ, తొలిసారి నాఫెడ్ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా వ్యాపారులతో పోటీ పడుతూ మార్కెట్ ధరకు కొనుగోలు చేస్తున్నది. మద్దతు ధర క్వింటాలుకు రూ.7 వేలు ఉండగా, నాఫెడ్ నిర్ణయించిన ధర ప్రకారం రూ.10 వేలకు మార్క్‌ఫెడ్ కందులను కొనుగోలు చేస్తున్నది. వానకాలం సీజన్‌లో రాష్ట్రంలో 4.74 లక్షల ఎకరాల్లో కంది పంట సాగు కాగా, 2.37 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్లో భారీ ధర పలుకుతుండటంతో కంది రైతులకు గిట్టుబాటు అవుతున్నది. రాబోయే రోజుల్లో కందిపప్పు ధర కిలో రూ.200 పలుకవచ్చని అంచనా వేస్తున్నారు.

## రవాణా శాఖ కానిస్టేబుళ్ల సంఘం కార్యవర్గం

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): రవాణాశాఖ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యవర్గం ఎన్నికల అధికారిగా మేడ్చల్ ఆర్టీఏ డీ ప్రదీప్ రామకృష్ణ, రిటైర్డ్ ఏవో షేక్ ముంతాజ్ వ్యవహరించారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా జీ శ్రీనివాస్, అధ్యక్షుడిగా ఎస్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఆర్ ప్రతీశ్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా కే గోవింతరాజ్, కోశాధికారిగా బీ హనుమంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సీహెచ్ శ్రీనివాస్, ఆర్ చంద్రశేఖర్, ఏ గౌతమి భవాని, జాయింట్ సెక్రటరీలుగా డీ నవీన్‌కుమార్, సీహెచ్ గంగాధర్, కే సింధూజ ఎన్నికయ్యారు.

## 32 ఏండ్ల తర్వాత కాళ్లకు చెప్పులు

**నెరవేరిన మహారాష్ట్ర పౌరుడి కల**

ముంబై, జనవరి 22: రామ జన్మభూమిలో ఆలయ నిర్మాణం జరిగేవరకు కాళ్లకు చెప్పులేసుకోను.. అంటూ ప్రతినబూనిన ఓ రామభక్తుడి కల నెరవేరింది. ఉత్తర మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాకు చెందిన విలాస్ భవ్‌సర్ 32 ఏండ్ల తర్వాత తన కాళ్లకు చెప్పులేసుకోవటం వార్తల్లో నిలిచింది. జలగావ్‌లో పాన్ దుకాణం నడుపుకునే భవ్‌సర్ 1992లో అయోధ్య ఉద్యమంలో వలంటీర్‌గా పనిచేశాడు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన వెంటనే, భవ్‌సర్.. తన దీక్షను విరమించాడు. మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ చేతులమీదుగా ఒక జత చెప్పులు అందుకొని కాళ్లకు వేసుకున్నాడు.

## ఇషా తుఫానుతో యూకే అతలాకుతలం

లండన్, జనవరి 22: ఇషా తుఫానుతో బ్రిటన్, ఐర్లాండ్ అతలాకుతలమవుతున్నాయి. గంటకు 160 కిలోమీటర్లకు పైగా వేగంతో వీస్తున్న గాలులకు చెట్లు అమాంతం కూలుతున్నాయి. ఫలితంగా లక్షలాది ఇండ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సోమవారం వందలాది రైళ్లు రద్దయ్యాయి. భారీ వర్షానికి తోడు ఈదురు గాలులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రోడ్లపై చెట్లు కూలడంతో రోడ్డు రవాణాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఐర్లాండ్‌లో దాదాపు 2.3 లక్షల ఇండ్లు కరెంటు లేక చీకట్లో మగ్గిపోతుండగా పొరుగునే ఉన్న ఉత్తర ఐర్లాండ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

# సింగరేణి 2ఏ గనిలో ప్రమాదం

- మైనింగ్ సర్దార్‌కు గాయాలు
- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం
- గుర్తింపు సంఘం కార్యదర్శి కవ్వంపల్లి

గోదావరిఖని, జనవరి 22: సింగరేణి ఆర్జీ-1 జీడీకే-2ఏ గనిలో సోమవారం ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మందల సమ్మిరెడ్డి అనే మైనింగ్ సర్దార్ తీవ్రంగా గాయపడ్డాడు. గనిలో బొగ్గు బయటకు తీసుకొచ్చే టబ్బుల లింకు తెగి కార్మికుడిని ఢీకొట్టడంతో ఆయన కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. మొదట 'ఖని' సింగరేణి దవాఖానకు అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కామినేని దవాఖానకు తరలించారు. ప్రమాద సమయంలో అక్కడే ఉన్న ఏడుగురు కార్మికులు టబ్బులు తగలకుండా తప్పించుకున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని గుర్తింపు సంఘం కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకుడు ఆరెల్లి పోచం ఆరోపించారు. ఉత్పత్తి లక్ష్యం చేరుకోవాలన్న ఆతృతలో కార్మికులకు రక్షణ చర్యలు కల్పించడంలో, క్రమం తప్పకుండా రక్షణ సమావేశాలు నిర్వహించడంలో యాజమాన్యం విఫలమైందని విమర్శించారు. ఈ ఘటనకు యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు రామస్వామి, వెంకటరెడ్డి, ప్రభుదాస్ ఉన్నారు.



బోర్డు లేకుండా బోసిబోయి కనిపిస్తున్న కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ భవనం

# కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ బోర్డు తొలగింపు

- స్పష్టత ఇవ్వని అధికారులు
- 'కేసీఆర్'గా పిలువడమే కారణమా?

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 22: కరీంనగర్ నడిబొడ్డున అద్భుతంగా నిర్మించిన కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ (కేసీఆర్) హౌస్ బోర్డును సోమవారం తొలగించారు. దశాబ్దాల కింద నిర్మించిన కరీంనగర్ ఆర్ అండ్‌బీ అతిథి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో గత ప్రభుత్వం రూ.7.50 కోట్లు వెచ్చించి జీప్లస్ వన్ పద్ధతిలో అద్భుతంగా నిర్మించింది. ఈ భవనానికి పెట్టిన బోర్డును ఎవరు తొలగించారనేది ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా స్పష్టత ఇవ్వడం లేదు. కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్‌ను కేసీఆర్ హౌస్‌గా పిలుస్తున్నారన్న అక్కసుతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బోర్డు తొలగించదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# గొయ్యిలో 2 లక్షలు దాచిన వృద్ధురాలు

- కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు
- నగదు గుర్తించి అందజేసిన ఎస్సై



గొయ్యిలో పాతి పెట్టిన నగదును వెలికితీస్తున్న ఎస్సై ఉపేందర్

బయ్యారం, జనవరి 22: పైసా పైసా కూడేసిన డబ్బులు భద్రంగా దాచుకునేందుకు ఓ వృద్ధురాలు గొయ్యి తీసి పాతి పెట్టింది. అవి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వచ్చి వెతికి వృద్ధురాలికి డబ్బులను అప్పగించారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం జగ్గు తండాలో సోమవారం చోటుచేసుకున్నది. తండాకు చెందిన తమ్మిశెట్టి రంగమ్మ చిన్న కిరాణం కొట్టు నడుపుతూ జీవిస్తున్నది. ఈ క్రమంలో తన వద్దనున్న రూ.2 లక్షలు ఇంట్లో పెడితే దొంగలు ఎత్తుకెళ్తారనే భయంతో ప్లాస్టిక్ డబ్బాలో ఉంచి ఇంటి ఆవరణలో గొయ్యి తీసి పాతి పెట్టి ఊరికెళ్లింది. అనంతరం వచ్చిన వృద్ధురాలు డబ్బులు కనిపించకపోవడంతో రెండు రోజుల క్రితం నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సోమవారం వృద్ధురాలి ఇంటికొచ్చిన ఎస్సై ఉపేందర్.. తన సిబ్బందితో కలిసి ఇంటి ఆవరణలో వెతకగా భూమిలో పాతిపెట్టిన రూ.2 లక్షలు దొరికాయి. ఆ నగదును స్థానిక ఎంపీటీసీ కుమారి, సర్పంచ్ రమేశ్ సమక్షంలో వృద్ధురాలికి అందజేశారు. డబ్బులు బ్యాంకులో దాచుకోవాలని ఎస్సై వృద్ధురాలికి సూచించారు.

# వీఆర్‌ఎస్ విజ్ఞానజ్యోతి విద్యార్థికి గోల్డ్ మెడల్



ధీరజ్

దుండిగల్, జనవరి 22: దుండిగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని వీఆర్‌ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాల విద్యార్థి ఎం ధీరజ్‌కు ఎన్‌సీసీ జూనియర్ నేవీ క్యాటగిరీలో ప్రధానమంత్రి బంగారు పతకం దక్కింది. ఈ మేరకు ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ కార్యాలయం సోమవారం ఢిల్లీలో ప్రకటించిందని పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొన్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తరఫున నిరుడు గణతంత్ర వేడుకల్లో ధీరజ్ పాల్గొన్నాడు. మొత్తం 3 లక్షల మంది క్యాడెట్లతో పోటీపడి ఈ విజయం సాధించాడు. ఈ నెల 28న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ప్రధాని చేతుల మీదుగా పతకం అందుకోనున్నాడు. ఈ సందర్భంగా ధీరజ్‌ను పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి, అధ్యాపకులు అభినందించారు.


